ఇఫ్తార్



మలక్‌పేట వాహేద్‌నగర్‌లో రంజాన్ మాసంలో భాగంగా జరిగిన ఇఫ్తార్ విందులో ఎంఐఎం శాసనసభాపక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే అహ్మద్ బలాల, పార్టీ నాయకుడు సైఫుద్దీన్ షఫీ - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి



వనస్థలిపురంలో ముదఫెర్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు రవికుమార్, శ్రీనివాస్, రామ్మోహన్, ముస్లిం మతపెద్దలు - కొత్తపేట, ఆంధ్రజ్యోతి



రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రజాసమస్యల పరిష్కార సమితి ఆధ్వర్యంలో ఆదివారం సరూర్‌నగర్‌లోని అశోకా ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముందుగా ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రజాసమస్యల పరిష్కార సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. గోపాల్ ముస్లిం మత పెద్దలకు ఖర్జూరం తినిపించారు. అనంతరం ముస్లింలకు స్వీట్లు, పండ్లు ఇతర వంటకాలను ఆయనే స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో సమితి నాయకులు మహమ్మద్ మహబూబ్, నవీన్‌గౌడ్, మునీర్‌పటేల్, కమలమ్మ పాల్గొన్నారు. - ఎల్బీనగర్, ఆంధ్రజ్యోతి



టీపీసీసీ ఓబీసీ ప్రధాన కార్యదర్శి పాల్కం శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర మేరు యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శంకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఢిల్లీలో సీడబ్ల్యూసీ శాశ్వత ఆహ్వాన కమిటీ సభ్యుడు గురుదీప్‌సింగ్ సత్పాల్‌ను కలిసి చట్టసభల్లో రిజర్వేషన్ అమలు చేసేలా ఒత్తిడి చేయాలని విజ్ఞప్తి చేశారు. - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి



కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, సగర సంఘం నాయకులు

వైభవంగా ప్రారంభమైన భద్రాచలం పాదయాత్ర

చంపాపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఈనెల 17న జరగనున్న సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవానికి సగరవంశ చక్రవర్తి శ్రీరాముని వంశీయులైన సగర/ఉప్పరులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు, వడిబియ్యం సమర్పించుట కోసం ఆదివారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం నుంచి భద్రాచలం వరకు తెలంగాణ సగర సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యం లో మహా పాదయాత్ర కార్యక్రమం చేపట్టారు. అంతకు ముందు ఆలయానికి విచ్చేసిన సగర సంఘం నేతలకు ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి స్వాగతం పలికారు. కార్యక్రమంలో గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్ సగర, తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సురేష్, నాయకులు విష్ణు, ఆంజనేయులు, గణేష్, తిరుమలేష్, న్యాయవాది ఉదయ, ఆస్కాని మారుతీసాగర్, హరికిషన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీరామ నవమి వసంత నవరాత్రులు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ భవానీనగర్‌లో గల సీతారామాంజనేయస్వామి, సంతోషిమాత ఆలయంలో మంగళవారం నూతన తెలుగు సంవత్సరం ఉగాది పర్వదినం నుంచి ఈనెల 17న జరగనున్న శ్రీరామ నవమి వరకు శ్రీరామ నవమి వసంత నవరాత్రులు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. మంగళవారం ఉదయం 9.30గంటల నుంచి 11.30గంటల వరకు సీతాలక్ష్మణహనుమాన్ సమేత శ్రీరామచంద్రస్వామి వారికి మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, మహామంగళహారతి కార్యక్రమాలు జరగనున్నాయి. 16న శత కలశాభిషేకం, 17న శ్రీరామనవమి సందర్భంగా సీతారామచంద్రస్వామి కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

హనుమాన్ శోభాయాత్ర సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి

సైదాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 23న నిర్వహించనున్న వీర హనుమాన్ శోభాయాత్ర సన్నాహక సమావేశం ఆదివారం సైదాబాద్‌లోని సరస్వతీ శిశుమందిర్‌లో భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. యాత్ర ఈనెల 23న ఉదయం 7.30గంటలకు కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం వద్ద ప్రారంభమై చంపాపేట, సైదాబాద్, సరూర్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్ పురవీధుల మీదుగా కొనసాగుతుందని వివరించారు. విశ్వహిందూ పరిషత్ వివేకానంద జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రాంత సహకార్యదర్శి రావినూతల శశిధర్, ప్రాంత భజరంగ్ సంయోజక్ శివరాం, జిల్లా సంయోజక్ మహేష్‌యాదవ్, విభాగ్ కార్యదర్శి విరేశలింగం, జిల్లా కార్యదర్శి రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కిరాణాషాపు యజమాని

- అదుపులోకి తీసుకున్న పోలీసులు, 13 బీర్ బాటిళ్లు స్వాధీనం

కొత్తపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కిరాణాషాపు యజమానిని నాగోల్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి దుకాణం నుంచి 13 బీర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నాగోల్ పీఎస్ పరిధి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్ గ్రామంలో మేకల శ్రీశైలం మల్లికార్జున కిరాణాషాపు నిర్వహిస్తున్నాడు. అతడు సరుకులతో పాటు అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం రాత్రి ఆ కిరాణా షాపుపై దాడి చేసి 13 బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాలుష్య కాసారంగా సరూర్‌నగర్ చెరువు



కాలుష్యంతో నిండిన సరూర్‌నగర్ చెరువు

- తాగునీరు.. పంటనీరు అందించిన తటాకం
- మానవ తప్పిదాలతో నేడు కలుషిత నీటి కేంద్రంగా..
- చెరువును పరిరక్షించాలంటూ ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

సైదాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడూ ప్రజలు తాగేందుకు, పంటకు స్వచ్ఛమైన నీరందించిన సరూర్‌నగర్ చెరువు నేడు మానవతప్పిదాలతో కాలుష్య సాకారంగా మారిపోయింది. మురుగు, జంతువ్యర్థాల కలయికతో పూర్తిస్థాయిలో డిజాల్వ్‌డ్ ఆక్సిజన్(డీవో) పడిపోయింది. దీంతో జలచరాలు సైతం ఆక్సిజన్ అందక కొట్టుమిట్టాడుతున్నాయి. సుందరీకరణ మాటేలా ఉన్నా సరూర్‌నగర్ చెరువు అధికారుల నిర్లక్ష్యం కారణంగా మురుగు చేరి కాలుష్య కాసారంగా మారింది. చెరువు పరిసరాల్లోకి వెళ్తే ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వ్యర్థాలను పడవేయడం, కొందరు డ్రైనేజీ పైపు లైన్ల ద్వారా మురుగును చెరువులో మళ్లించడం జరుగుతుంది. చెరువులో కాలుష్యానికి తోడు గుర్రపు డెక్క విస్తరిస్తుండటంతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువు నుంచి వస్తున్న దుర్వాసన భరించలేక అన్ని సమయాలలో తలుపులు వేసుకుని ఇళ్లలో ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. సుందరీకరణలో భాగంగా చెరువులో మురుగు నీరును తొలగించి, పూడికతీత తీయాలని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కానీ ఐదేళ్లుగా ఆచరణకు నోచుకోలేదు. ప్రస్తుత వేసవి కాలంలో మురుగునీటిని బయటకు పంపించే చర్యలు చేపట్టడం లేదు. అధికారులలో చిత్తశుద్ధి లేకపోవడంతో పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుంది.

వాకింగ్ ట్రాక్ పూర్తయ్యేదెన్నడో..

సరూర్‌నగర్ చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు చేపట్టిన వాకింగ్ ట్రాక్(మినీ ట్యాంక్ బండ్) నిర్మాణ పనులు ప్రశ్నార్థకంగా మారింది. ఐదేళ్లుగా పనులు నత్తనడకగా సాగుతుండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు ఐదేళ్లుగా కొనసాగుతున్న చెరువు చుట్టూ కట్ట(వాకింగ్ ట్రాక్)తో మరింత కుదించుకుపోయింది. ఇదే అదనుగా ఎఫ్‌టీఎల్ మరింతగా అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. మిషన్ కాకతీయ కింద 2018లో సరూర్‌నగర్ చెరువు అభివృద్ధి, సుందరీకరణ కోసం ప్రభుత్వం సుమారు రూ.15కోట్ల నిధులు మంజూరు చేసింది. సుందరీకరణలో భాగంగా ముందుగా ఎగువ నీరు వచ్చే వరద నీరు చెరువులోకి రాకుండా చుట్టూ మట్టి కట్టలు ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్‌లుగా వాడుకునే విధంగా నిర్మాణ పనులు ప్రారంభించారు. కానీ ఆశించిన స్థాయిలో జరడగం లేదు. పనుల్లో కదలిక ఇప్పటికైనా వస్తుందేమోనని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



చెరువులో నీరు పూర్తిగా కలుషితమైంది. అధికారులు ఇప్పటికైనా రక్షణ చర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో మరింత నష్టం జరుగుతుంది. వేసవి కాలంలో చెరువు కలుషిత నీటిని తొలగించి పూడకతీత పనులు చేపట్టాలి. పూర్తిస్థాయిలో సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి త్వరితగతిన సుందరీకరణ పనులు చేపట్టాలి.

- రమణ్‌సింగ్, సైదాబాద్

పనులు వేగవంతం చేయండి



సరూర్‌నగర్ చెరువు క్లీనింగ్, బ్యూటిఫికేషన్, వాకింగ్ ట్రాక్ పనులు వేగవంతం చేయాలి. ప్రజలకు దోమల బెడద, చెరువు నుంచి వెదజల్లే దుర్వాసనలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యుద్ధప్రాతిపదికన చెరువు సుందరీకరణ పనులు చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలి. చెరువులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

- యాట ప్రమోద్‌ముదిరాజ్, మాదన్నపేట

ఐదేళ్లుగా అసంపూర్తిగా వాకింగ్ ట్రాక్ పనులు



పర్యావరణం బాగుంటేనే సంపూర్ణ ఆరోగ్యం

- గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంస్థల చైర్మన్ రాజేందర్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ పరిధిలోని గాంధీయన్ బీఈడీ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంస్థల చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి, పర్యావరణం, సహజవనరులు బాగుంటేనే సమస్త ప్రాణకోటి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రకృతి వైద్యులు డాక్టర్ కేవై రామచంద్రం నా ఆరోగ్యం-నా హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ వైస్ చైర్మన్ డాక్టర్ యాణాల ప్రభాకర్ రెడ్డి, చైతన్యరెడ్డి, శివారెడ్డి, సుభాష్‌చంద్ర, పర్యావరణ మిత్ర అవార్డ్ గ్రహీత డాక్టర్. టి సురేందర్ పాల్గొన్నారు.



ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో రాజేందర్‌రెడ్డి తదితరులు

నిరుపేదలను ఆదుకోవడానికే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

బర్కత్‌పుర, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుపేద రెడ్డి సామాజిక వర్గాన్ని అన్ని విధాలుగా ఆదుకోవడానికే రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రెడ్డి గర్జన అధ్యక్షుడు గుర్రం పాపిరెడ్డి ఆధ్వర్యంలో 2024 డైరీ ఆవిష్కరణ, వివిధ రంగాలలో రాణిస్తున్న వారికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న రాష్ట్రపతి అవార్డు గ్రహీత చింతల వెంకటరెడ్డి, శ్రీలక్ష్మీరెడ్డి, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, రత్నారెడ్డి, డీజే.వసంతరెడ్డికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి, రెడ్డి జేఏసీ జాతీయ అధ్యక్షుడు నవల్గా సత్యనారాయణ రెడ్డి, తెలంగాణ రెడ్డి ఐక్యవేదిక అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో చైన్ స్నాచింగ్

- వృద్ధురాలి మెడలో గొలుసు లాక్కొని పారిపోయిన యువకుడు

జవహర్‌నగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జవహరనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడలో ఆదివారం చైన్ స్నాచింగ్ జరిగింది. నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలి మెడలోని గొలుసును బైక్‌పై వచ్చిన ఓ యువకుడు లాక్కొని పారిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సాయమ్మ(60) తన కుమార్తెతో కలిసి ఈసీఐఎల్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చింది. ఆదివారం సాయంత్రం తన పెద్ద కుమార్తెతో కలిసి కాప్రాలోని ఎల్లారెడ్డిగూడలో ఉంటున్న చిన్న కుమార్తె ఇంటికి ఆటోలో వచ్చింది. బస్టాపు నుంచి కుమార్తె ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా.. వెనుక నుంచి పల్సర్‌బైక్‌పై వచ్చిన యువకుడు వృద్ధురాలి మెడలోని 5తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.



ఉగాది పంచాంగం ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

ఉగాది పంచాంగం ఆవిష్కరణ

సరూర్‌నగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ నగర బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్రోధి నామ తెలుగు నూతన సంవత్సరం ఉగాది పంచాంగాన్ని ఆదివారం ఉదయం బడంగ్‌పేట్‌లోని కాశీబుగ్గ శివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మంగు రాఘవరావు, విరాట్ స్వరూప్ ఆధ్వర్యంలో, తెలంగాణ శ్రీవైష్ణవ సేవా సమితి గౌరవాధ్యక్షుడు చక్రవర్తుల జగన్ మోహనాచార్యుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన సంవత్సరం పంచాంగాన్ని ఆవిష్కరించి, అందులోని ప్రధాన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నవీన్‌కుమార్, రవికుమార్, రాంబాబు, ప్రకాశ్, శ్రీనివాస్‌రావు, ఉమాశంకర్‌రావు, వెంకట రామారావు, కార్తీక్, కవిత, భార్గవి, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

పీఆర్‌సీ బాండ్స్ బకాయిల చెల్లింపుల్లో వివక్ష వద్దు

- ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో 2013 పీఆర్‌సీ బాండ్స్ బకాయిలను కేవలం 15వేల మంది డ్రైవర్లకే చెల్లించి, కండక్టర్లు, ఇతర కార్మికులు, ఉద్యోగులకు నిలిపివేయడం అన్యాయమని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వర్ రావు ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంలో డ్రైవర్లతోపాటు కండక్టర్లు, ఇతర గ్యారేజీ కార్మికులు సైతం కృషిచేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఆర్టీసీలో సుమారు 42 వేల మంది కార్మికులు దాచుకున్న బాండ్స్ డబ్బులను అందరికీ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం 15వేల మంది డ్రైవర్లకు అందించి, మిగిలిన 27 వేలమందికార్మికులు(15వేల మందికండక్టర్లు, 4వేల మంది గ్యారేజీ, 6వేల మంది ఇతర సెక్యూరిటీ క్లరికల్, సూపర్‌వైజర్‌లు)ను విస్మరించడం దారుణమన్నారు. తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగ నాటికి 2013 నాటి పీఆర్‌సీ బకాయిలను పూర్తిస్థాయిలో ఆర్టీసీలోని కార్మికులందరికీ చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆర్టీసీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ బకాయిలు చెల్లింపుల కోసం రాష్ట్రప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యం చేయడం భావ్యం కాదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన నిధులు, సబ్సిడీల చెల్లింపులు, ఆర్టీసీ ఆర్థిక పరిస్థితిపై యాజమాన్యం శ్వేతపత్రం విడుదల చేయాలని నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు.

ఆటోలో నిద్రిస్తున్న డ్రైవర్‌ను పొడిచి.. దోచుకున్న ముఠా

- ముగ్గురిని అరెస్ట్ చేసిన మీర్‌చౌక్ పోలీసులు

హైదరాబాద్ సిటీ/చార్మినార్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఆటోలో నిద్రిస్తున్న ఆటోడ్రైవర్‌పై దాడిచేసి, నగదు, సెల్‌ఫోన్ దోచుకున్న ముగ్గురు నేరస్థులను మీర్‌చౌక్ పోలీసులు అరెస్ట్ చేశారు. పురానీహవేలిలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సౌత్‌జోన్ ఏడీసీపీ షేక్ జహంగీర్ వివరాలు వెల్లడించారు. దోపిడీకి పాల్పడిన ఇద్దరు నిందితులు పాత నేరస్థులని, వివిధ పోలీస్‌స్టేషన్‌లలో వారిపై కేసులున్నాయని తెలిపారు. కిషన్‌బాగ్‌కు చెందిన ఆటోడ్రైవర్ సయ్యద్ అబ్దుల్ హసన్ (35) పాత నేరస్తుడు. ఇతడిపై నగరంలో పలు పోలీస్‌స్టేషన్‌లలో 17 కేసులున్నాయి. యాకుత్‌పురాకు చెందిన సయ్యద్ తాలిబ్‌అలీ అలియాస్ సమీర్(22) ప్రైవేటు ఉద్యోగి, ఇతడిపై కూడా పలు పోలీస్‌స్టేషన్‌లలో 7 కేసులున్నాయి. బాల్‌షెటికేత్‌కు చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ తాహెర్ అలీ(30) స్నేహితులు. ఈనెల 5వ తేదీ తెల్లవారు జామున తాహెర్ అలీ, సమీర్, హసన్ ముగ్గురు ఆటోలో సాలార్‌జంగ్ మ్యూజియం రోడ్డులో వెళుతున్నారు. మాతాకిడికి ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ దస్తగిరి (35) ఈనెల 5వ తేదీ ఉదయం 5.30 గంటల ప్రాంతంలో సాలార్‌జంగ్ మ్యూజియం సమీపంలోని చిల్లా వద్ద రోడ్డుపక్కగా ఆటో ఆపి పడుకున్నాడు. వీరు ముగ్గురు ఆటోలో పడుకొని ఉన్న దస్తగిరి రెండు తొడలపై కత్తితో పొడిచి బెదిరించి, అతడి వద్ద ఉన్న రూ. 500, సెల్‌ఫోన్ తీసుకొని పరారయ్యారు. బాధితుడు మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న మీర్‌పేట డీఐ దిలీప్‌కుమార్ బృందం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రెండు కత్తులు, ఆటో, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సౌత్ జోన్ ఏడీసీపీ షేక్ జహంగీర్

రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో అగ్నిప్రమాదం

- భారీగా ఎగిసిపడిన మంటలు
- నగర శివారులో ఘటన



మార్కెట్‌లో ఎగిసిపడుతున్న మంటలు, పొగ చెలరేగిన దృశ్యాలు

నార్సింగ్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో త్వరలో ప్రారంభం కానున్న ఓ సూపర్ మార్కెట్ కాలి బూడిదైంది. ఈ ఘటన బండ్లగూడ మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. లంగర్‌హౌజ్-అప్పా రేడియల్ మార్గంలో ప్రధాన రోడ్డుకు అనుకుని రత్నదీప్ సెలెక్ట్ సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఉగాది నుంచి ప్రారంభం కావాల్సిన మార్కెట్‌లో సెంట్రల్ ఏసీతో పాటు అన్ని రకాల ఎలక్ట్రికల్ పరికరాల ఏర్పాటు జరుగుతోంది. ఆదివారం సామగ్రి ఏర్పాటు చేస్తుండగా అగ్ని ప్రమాదం జరిగిందని, మంటలకు దట్టమైన పొగ అలుముకోవడంతో అందరం ఒక్కసారిగా బయటకు పరుగులు పెట్టామని కార్మికులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో కార్మికులు ఎవరూ గాయపడలేదని జిల్లా అగ్నిమాపక అధికారి గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఆస్తి నష్టం లక్షల్లోనే ఉంటుందని, ఈ ప్రమాదానికి వెల్డింగ్ పనులు కారణమా లేక షార్ట్ సర్క్యూట్ కారణమా అన్నది దర్యాప్తులో తేలుతుందని అన్నారు. ఈ ఘటనపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

'లిక్కి'కి పితృ వియోగం



కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 22వ డివిజన్ కార్పొరేటర్ లిక్కి మమత తండ్రి లిక్కి వెంకట్‌రెడ్డి ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మమతాకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరామర్శించిన వారిలో బడంగ్‌పేట్ కౌన్సిల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అర్జున్, కార్పొరేటర్లు శోభాఆనంద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, స్వప్నాజంగారెడ్డి, స్వప్నావెంకట్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు గుర్రం ప్రసన్నావెంకట్‌రెడ్డి, భాగ్యనగర్ రైతు సొసైటీ చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

మెడికల్ కౌన్సిల్ పూర్వ రిజిస్ట్రార్ సత్యనారాయణ మూర్తి అస్తమయం

కొత్తపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విశ్రాంత డిప్యూటీ సెక్రెటరీ, జంట తెలుగు రాష్ట్రాల మెడికల్ కౌన్సిల్ పూర్వ రిజిస్ట్రార్ కే సత్యనారాయణ మూర్తి (84) ఎల్బీనగర్ నాగోల్ స్నేహపురి కాలనీలోని స్వగృహంలో ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. స్నేహపురి కాలనీలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా, ట్రస్టీగా, స్నేహపురికాలనీ సంక్షేమ సంఘం సీనియర్ సభ్యులుగా పలు అభివృద్ధి పనులకు ఆయన సహకరించారు. ఆయన మృతికి సంతాప సూచకంగా ఆదివారం వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మూసి ఉంచారు. ప్రస్తుతం ఆయన కుమారుడు ప్రసన్న కృష్ణ ఆలయ కమిటీ కార్యదర్శిగా ఉన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వారణాశి వంశీ, ట్రస్టీ అనంతుల సురేందర్‌రెడ్డి, స్నేహపురి, అల్కాపురి, న్యూనాగోల్ తదితర కాలనీల ప్రతినిధులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మళ్లీ పెరిగిన చికెన్ రేట్లు

- లైవ్‌బర్డ్ రూ.220
- స్కిన్‌లెస్ కిలో రూ. 320
- నాటుకోడి కిలో రూ.400పైనే..
- కృత్రిమ కొరత సృష్టించి దోచుకుంటున్న వైనం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో చికెన్ రేట్లు మళ్లీ దడ పుట్టిస్తున్నాయి. 15రోజుల క్రితం వరకు కాస్త అందుబాటులోకి వచ్చిన ధరలు.. ఆదివారం ఒక్కసారిగా పెరిగాయి. కిలోపై రూ.80 నుంచి రూ.100 వరకు పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు చికెన్‌ను కొనుగోలు చేసేందుకు వెనకంజ వేశారు. గ్రేటర్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా చికెన్ రేట్లు గరిష్ఠంగా పెరిగాయి.

తగ్గినట్లే తగ్గి..!

మార్చి మూడో వారంలో నగరానికి కోళ్ల దిగుమతి పెరగడంతో రేట్లు కాస్తా అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు మార్చి 17 నుంచి ఏప్రిల్ 2 వరకు లైవ్‌కోడి కిలో రూ.120 నుంచి రూ.140 వరకు, స్కిన్‌లెస్ కిలో రూ.180 నుంచి రూ.200-220 వరకు విక్రయించారు. అయితే రేట్లు అందుబాటులోకి వచ్చాయని భావిస్తున్న తరుణంలో రెండు రోజులుగా మళ్లీ పెంచారు. ఆదివారం స్కిన్‌లెస్ కిలో రూ.300 నుంచి 320 వరకు, లైవ్‌బర్డ్ రూ.200 నుంచి రూ.210 వరకు విక్రయించారు. అలాగే నాటుకోడి కిలో బర్డ్‌ను రూ.400పైగానే అమ్మారు.

ఎండలను అడ్డుపెట్టుకుని దోపిడీ..

నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ఎండలను అడ్డుపెట్టుకుని వ్యాపారులు అడ్డగోలుగా దోచుకుంటున్నారని కొనుగోలుదారులు వాపోతున్నారు. నగర శివారు ప్రాంతాల నుంచి కోళ్ల దిగుమతి ఎక్కువగా ఉన్నప్పటికీ కొంతమంది కృత్రిమ కొరత సృష్టించి అందినకాడికి దోచుకుంటున్నారని చెబుతున్నారు. స్కిన్‌లెస్ కిలో రూ. 300 నుంచి 320వరకు రేటు పెట్టడం దారుణమని, దీనికంటే రూ.400 పెడితే మటన్ వస్తోందని పేర్కొంటున్నారు. ధరల నియంత్రణపై ఎవరూ పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.